# చేయూత

వర్మగారంటే నాకెంతో గౌరవభావముండేది. ఆకలితో అలమటించే ఎందరో దౌర్భాగ్యుల గురించి ఆయన చలించిపోవడమేకాక పది మందిని చలింపజేసేలా మాట్లాడడమే అందుక్కారణం. కానీ ఈ రోజుతో ఆ గౌరవ భావం పోయినట్లే అనిపించింది.

వర్మగారు నిర్మొహమాటం మనిషి. నేను ఖరీదైన వస్తువు కొనుక్కున్నప్పుడల్లా ఆయన నన్ను విమర్శించేవారు.

"నాకు సంపాదించుకునే సమర్థత ఉంది. సంపాదించుకుంటున్నాను. నా సంపాదన నా అనుభవం కోసం. అదృష్టవశాత్తూ నేనున్నది కమ్యూనిస్టు దేశం కాదు" అని నేనాయనకు చెప్పానొకసారి. ఆయన నవ్వి, "నీ అనుభవం కోసమే నీ సంపాదన అని నేనూ ఒప్పుకుంటాను. కానీ ఎందరో అభాగ్య జీవులు కనీసావసరాలైన తిండి, గుడ్డ లేక అలమటించిపోతూంటే అలాంటి వారికి ఏదో విధంగా, కొంత సహాయపడడం ప్రతి పౌరుడూ తన కనీస ధర్మంగా భావించగలగాలి. మన దేశంలో ప్రతి ఒక్కడూ బ్రతకడానికి వీలు పడినప్పుడు..నువ్వు స్టీరియో సిస్టం కొనుక్కో, రిఫ్రిజిరేటర్లు కొనుక్కో, టీవీలు కొనుక్కో. నేను సంతోషిస్తాను. కానీ ఇప్పుడలాంటివన్నీ కొనుక్కుంటే వాటిలోంచి నీకు పేదవాళ్ళ ఆక్రందనలే వినబడతాయి" అన్నాడు.

"అయితే నన్నేం చేయమంటారు?" అన్నాను.

"చేయూత..పేద ప్రజలకు చేయూత."

"అందుకు నాయకులున్నారు. సేవా సంస్థలున్నాయి. ఇంకా చెప్పాలంటే మీ వంటి చలిత మనస్కులున్నారు." అన్నాను.

"నిజమే! కానీ నాలో నాయకత్వపు లక్షణాలు లేవు. పది మందిని కూడగట్టుకుని ఏ

పనైనా చేయించగల సామర్థ్యం అందరికీ ఉండదు. నీలో నాయకత్వపు లక్షణాలు ఉన్నాయి. నీవంటివాడు పూనుకుని ముందుకు వస్తే అందుకోసం ఎటువంటి త్యాగం చేయడానికికైనా నేను సిద్ధమే!'' అన్నారు వర్మగారు.

ఆయన కళ్ళల్లో ఆవేదనతోపాటు, నిజాయితీ కూడా ఉన్నది.

నాలో నాయకత్వపు లక్షణాలున్నమాట నిజమే! నేను మా ఆఫీసులో ఉద్యోగులకు నాయకుణ్ణి. వీధిలో వారందర్నీ కూడగట్టుకుని - పిక్నిక్ కార్యక్రమాలు ఏర్పాటు చేయిస్తూంటాను. అయితే నా నాయకత్వపు సామర్థ్యాన్ని దీనజనోద్ధరణకుపయోగించాలని వర్మగార నుకుంటున్నారు. అది నా కిష్టం లేదు. కానీ ఆయన మాటలు నన్ను కాస్త చలింపజేశాయి. కొందరు స్నేహితుల వద్ద ఆయన ఆవేదన గురించి చెప్పాను.

"అన్నీ దొంగ మాటలు...'' అన్నాడో స్నేహితుడు.."కొంత మంది ముసలాళ్ళకు పన్యాసాలిచ్చే సరదా ఉంటుంది. అయిన దానికీ కాని దానికీ లెక్చర్లిచ్చి బోరు కొట్టే అలవాటు కొందరికుంటుంది. ఇంతకీ తన శక్తి కొద్దీ ఆయన చేస్తున్నదేమైనా ఉన్నదా?''

ఆయన్ను విమర్శించడం నా కిష్టముండదు. అయితే ఆ తర్వాత నాకు తెలిసిందేమిటంటే ఆయన డబ్బు విషయంలో మహాజాగ్రత్త మనిషి అని. చాలా మంది చందాలకని వాళ్ళింటికి వెళ్ళి ఉత్త చేతులతో వెనక్కుపోయారట. అయితే అందుకు నేనాయన్ను తప్పు పట్టలేదు. చందాల పేరు చెప్పి తిరిగేవారంటే నాకూ చిరాకే! ఏ పేరు చెప్పి చందాలు వసూలు చేశారో..ఆ కార్యానికుపయోగపడే చందా డబ్బు చాలా తక్కువని నా నమ్మకం.

కొంతమంది పేదవాళ్ళనాయన స్వయంగా ఆదుకుంటున్నట్లు నాకు తెలుసు. అందువల్ల ఆయనపట్ల నాకున్న గౌరవభావం ఈ మధ్య దాకా.. ఆ మాటకొస్తే ఈ రోజు దాకా ఈషణ్మాత్రం కూడా తగ్గలేదు. కానీ ఈ రోజు...

వరదలు వచ్చాయి. కొన్ని ప్రాంతాల జనం నీటి మధ్య చిక్కుకు పోయారు. వేలకొద్దీ ప్రజలు నిరాశ్రయులయ్యారు.

వరద బాధితుల్ని ఆదుకోవడానికి ఎందరో ముందుకు వచ్చారు. మూలమూల ప్రాంతాలకూ వెళ్ళి ఆహారం అందించడానికి జట్లు జట్లుగా జనం వెడుతున్నారు. అందులో మోసం లేదు. దగా లేదు. సాటి మానవుడిని ఆదుకోవాలనే తహ తహ అందరిలోనూ ఉన్నది. ఆ సమయంలో నాలోని నాయకుడు విజృంభించాడు. మా వీధిలోని వారందరం కొంత డబ్బు ప్రోగు చేశాం. బియ్యం, గోధుమపిండి, బంగాళా దుంపలు వగైరాలు కొన్నాం. వీధిలోని అందరి సహకారంతోనూ అన్నం, చపాతీలు, కూర తయారుచేశాం. ఆ విషయంలో అంతా నా కిచ్చిన సహకారం మరువలేనిది.

సుమారు అయిదు వేల రూపాయలు వసూలయింది. ఆ డబ్బుతో సుమారు నాలుగైదు గ్రామాల వరద బాధితులకు సరిపడా ఆహారం తయారవుతోంది. ఆపైన పాత బట్టలు వసూలు చేశాం. ప్రభుత్వం మా కోసం ట్రక్కు ఇచ్చింది. మొత్తం ఇరవైమందిమి ట్రక్కులో ఆహార పదార్థాలతో బయల్దేరి మారుమూల ప్రాంతాలకు వెళ్ళాం.

ఆ ప్రయాణం ఎంతో యిబ్బందికరమైనది. అయినా సహించాం. వరద బాధితులను

చూస్తుంటే మనసు చలించిపోయింది. కడుపు తరుక్కుపోయింది.

అది చాలా మారుమూల ప్రాంతం కావడం వల్ల, ఆహారం సరఫరా కావడం లేదు. నాలుగు రోజులుగా ఆ గ్రామ ప్రజలు ఆకలితో నకనకలాడిపోతున్నారట. ఊళ్ళోని పెద్ద కామందులు కొందరు అడపా తడపా అన్నదానాలు చేస్తున్నారుట. కానీ వారి అవసరం ముందు అది ఏపాటిది?

జీవితంలో ఓ గొప్పపని చేశాననే ఆనందం, తృప్తి ఆ రోజే నాకు కలిగాయి. అప్పుడే వర్మగారి మీద కోపం, చిరాకు కూడా కలిగాయి.

స్వయంగా నేనే వెళ్ళినా ఆయన నాకు పైసా కూడా చందా యివ్వలేదు. ఆహార పదార్థాల తయారీలో ఆయన కుటుంబం పాల్గొన లేదు. ఆఖరికి నాతోపాటు వలంటీరుగా రావడానికి కూడా ఆయన అంగీకరించలేదు.

"నీకు ఓపిక ఉంటే నా సహాయనిరాకరణకు కారణం చెబుతాను" అన్నారాయన.

"నాకు ఓపికలేదు" అని వచ్చేశాను అప్పుడు.

అందరకూ భోజనం పంచి వచ్చేక. ఒక్కసారి ఆ వరద బాధితుల దీనగాథను వర్మగారికి చెప్పి అవమానంతో పులుముకు పోయిన ఆయన మొహాన్ని చూడాలన్న కోరిక నాకు పుట్టింది. అందుకని తీరుబడి చేసుకునిమరీ ఆయనింటికి వెళ్ళాను.

"రా..రా! కూర్చో" అంటూ సాదరంగా ఆహ్వానించారాయన.

నేను కూర్చున్నాను. తర్వాత ఆయనకు విశేషాలు చెప్పనారంభించాను. చెబుతూంటె ఆ బాధితులంతా నా కళ్ళ ముందు మెదిలారు. అందువల్ల నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

వర్మగారు మాత్రం నవ్వుతున్నారు. నాకు ఉక్రోషం వచ్చింది.."నవ్వుతారేం?' అన్నాను.

"చెబుతాను. వినడానికి ఓపిక ఉందా?" అన్నారాయన.

"చెప్పండి"

"నిన్న నువ్వు పూనుకున్నావు. వాళ్ళకు భోజనం దొరికింది. మరి ఈవేళా, రేపూ సంగతి ఏమిటి?" అన్నారాయన.

"మరొకళ్ళు ఎవరో పెడతారు" అన్నాను.

'అంటే నీ హృదయం ఒక్క రోజుకు మాత్రమే చలించిందా? ఒక్కసారి వారికి భోజనం పంచిరాగానే నీ మనసుకు తృప్తి కలిగిందా? వారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లేనా?' అన్నారాయన.

జవాబేంచెప్పాలో నాకు తెలియలేదు. ఓ క్షణం ఆలోచించి.."ఎవరైనా ఎవరికైనా ఎంతకని సాయపడగలరు? శాశ్వత పరిష్కారం చేయలేము కదా అని ఉపేక్షిస్తామా? ఏదో ఉడతాభక్తి. అంతేకదా?" అన్నాను.

"సరిగ్గా.. అందుకే నాకు నవ్వొచ్చింది" అన్నారు వర్మగారు.

"నాకు అర్థం కాలేదు." అన్నాను.

"రావణాసురుడు లోక కంటకుడైతే రాముడికి బాధలేదు. అతడి జోలికి వెళ్ళడు. తన సీతను ఎత్తుకుపోతే మాత్రం రావణుడిని మట్టు పెట్టాలనుకుంటాడు. అలాంటి రాముడికే

ఉడతలూ సాయపడాలనుకుంటాయి'' అన్నారు వర్మగారు.

"అంటే మీ ఉద్దేశ్యం?'' అన్నాను. ఆయనేం చెప్పదల్చుకున్నదీ నా కింకా అర్థం కాలేదు.

"నీకు పేదల ఆక్రందన అంటే జాలి లేదు. నీలాంటి ఉన్నవాడొకడు హఠాత్తుగా వరద బాధితుడై అలమటిస్తూంటే కనీసం ఒక్కరోజైనా ఆదుకోవాలనిపిస్తుంది నీకు. ఇది స్వజాతి స్వార్థం. నీవు నిజంగా చలితమనస్కుడివే అయితే, అనుదినం నీ చుట్టూ చెలరేగే ఆకలి కేకలు నిన్నెందుకు కదిలించవు? నీలోని నాయకత్వపు లక్షణాలు వెలికి రావడానికి దేశంలో వరదలు రావాలా? వరదలు లేనప్పుడెవ్వరూ ఆకలి మంటలతో బాధపడడం లేదనే నువ్వు భ్రమపడుతున్నావా? ఈ ఉడతా భక్తి వరదలొచ్చినప్పుడే బయటపడుతుందా?''

వర్మగారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆయన ఆవేదన కొంతవరకూ నాకు అర్థమయింది. వరదల కారణంగా తాత్కాలికంగా నిరాశ్రయులైనవారిని ఆదుకోవాలని నాకు అనిపించింది. కానీ ఏ ప్రకృతి భీభత్సమూ లేని సమయంలో కూడా నా చుట్టూ ఉన్న కోట్లాది నిరాశ్రయుల సంగతి ఏమిటి?

"నీ ఆలోచనలీదారికి మళ్ళాలనే నేనప్పుడు సహాయనిరాకరణ చేశాను'' - మళ్ళీ అన్నారు వర్మగారు.

"పోనీ మీరేం చేస్తున్నారో చెప్పండి'' అన్నాను కాస్త కసిగా.

"నేను నలుగురు బిచ్చగాళ్ళ కుటుంబాలను నా బాధ్యతగా స్వీకరించాను. వారి చేత అడుక్కు తినడం మానిపించాను. వారిని శ్రమజీవులుగా మార్చాను. వారికి అవసరమైనప్పుడల్లా నా శక్తికొలదీ సాయపడుతున్నాను. వారిలో ఒకడు కూలి చేసుకుంటున్నాడు. ఒకడు కిళ్ళీ కొట్టు పెట్టు కున్నాడు. ఒకడు కూరలమ్ముతున్నాడు. ఒకడు మాత్రం ఇంకా ఊగిసలాడుతున్నాడు. వాడినీ సరైన దారిలో పెట్టగలనన్న నమ్మకం నాకుంది'' అన్నారు వర్మగారు.

నేనాశ్చర్యంగా ఆయన చెప్పేది వింటున్నాను.

అట్టడుగు వర్గాలవారు మారాలంటే వారికి సాయం చేయడం ఒక్కటే కాదు. వారిని బాధ్యతగా స్వీకరించగల వర్మగారి వంటి పౌరులు కావాలి. అప్పుడు వారి జీవన విధానంలో మార్పురావడానికి కొన్ని పదుల వత్సరాలు చాలు.

"నాలో నాయకత్వపు లక్షణాలు లేవు. నీవంటి వాడు పూనుకుంటే నేను తలపెట్టిన ఉడతాభక్తి కార్యక్రమం.. ఒక గొప్ప ఉద్యమంగా మారి దేశ పుభవిష్యత్తునే మార్చి వేయగలదు. కానీ దురదృష్టమేమిటం టే వరదలు వస్తే తప్ప దేశంలో ప్రజలు అన్ని విధాలా సుఖంగా ఉన్నట్లేనని నువ్వు భావిస్తావు.''

నేను చటుక్కున వంగి ఆయన పాదాలకు నమస్కరించి, "మీరు గుర్తించిన నాలోని నాయకుడు మీ మనోభీష్టార్థం కృషిచేయాలనుకుంటున్నాడు. ఆశీర్వదించండి'' అన్నాను.

★

*(విజయ మాస పత్రిక - మార్చి, 1983)*